క్లుప్తంగా

ఖర్గేను కలిసిన ఖేడ్ ఎమ్మెల్యే



మల్లికార్జున ఖర్గేతో ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ పట్లోళ్ల కిష్టారెడ్డి బుధవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు. ఎమ్మెల్యేగా ఎన్నికైనందుకు అభినందిస్తూ ప్రాంతాభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషిచేయాలని ఈ సందర్భంగా ఖర్గే సూచించారని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి తెలిపారు.

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నర్సింహులు

హత్నూర(సంగారెడ్డి): పూర్తిస్థాయిలో అధికారులు హాజరుకాకపోవడం.. ఎంపీటీసీలు సైతం మెజార్టీ సభ్యులు రాకపోవడంతో మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగిపోయింది. ఎంపీపీ అధ్యక్షుడు నర్సింహులు అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు సగం మందికి సైతం దుమ్మా కొట్టడంతో మండల స్థాయిలో అధికారుల నివేదికలు పూర్తిస్థాయిలో సభ్యులకు అందలేకపోయాయి. సభ్యులు కూడా అంతంత మాత్రమే హాజరుకావడంతో నామమాత్రంగానే సమావేశాన్ని మమ అనిపించారు. సమావేశంలో ఎంపీడీవో శారదాదేవి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో నేడు రక్తదాన శిబిరం

నారాయణఖేడ్: ఖేడ్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సౌజన్యంతో శుక్రవారం ఉదయం 10 గంటలకు నారాయణఖేడ్‌లోని కరస్‌గుత్తిరోడ్ వాగ్దేవి కళాశాల రోడ్‌లైన్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు బ్లడ్‌డోనర్స్ గ్రూపు సభ్యులు ముజాహెద్‌చిస్తీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రక్తదానం చేసే దాతలు బీరాదర్ కిరణ్‌ను 9347844514, సంతోష్‌రావు 7780417576 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. రక్తదానం చేసేవారు తమతమ ఇళ్ల వద్దే భోజనాలు చేసి రావాలని సూచించారు.

గుండం బావి జాతర ప్రారంభం




పల్లకీసేవ ఊరేగింపు నిర్వహిస్తున్న భజన బృందం సభ్యులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధిలోని రాఘవేంద్రనగర్ కాలనీలో మాతృశ్రీ జానకమ్మ, రఘునాథస్వామి ఆరాధనోత్సవాలను నిర్వాహకులు నర్సింహారావు కులకర్ణి అధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ఉదయం మాతృశ్రీ జానకమ్మ, రఘునాథస్వామిల లఘున్యాస పూర్వక రుద్రాభిషేకము, ప్రభుమందిరం నుంచి ప్రధాన రహదారుల మీదుగా శ్రీవార్ల పల్లకీసేవ ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో సద్గురు భజన మండలి వికారాబాద్ బృందం భజన ఆకర్షించింది.

సీసీ రోడ్డు పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ పుష్పనగేష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆమె సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేవిధంగా కృషి చేస్తానని హామీనిచ్చారు.

తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత



బాలుడిని అప్పగిస్తున్న కానిస్టేబుల్

నారాయణఖేడ్: పట్టణంలోని రాజీవ్‌చౌక్ సమీపంలో గురువారం ఒక బాలుడు తప్పిపోయి ఏడుస్తూ తిరుగుతుండడంతో గోల్డెన్ బేకరిలో పనిచేస్తున్న నాయికిని శ్రీనివాస్ ఆ బాలుడిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించారు. ఆ బాలుడు తనపేరు వడ్డే విశాల్ అని తండ్రి పేరు రాములు, తమది కర్ణాటకలోని బీదర్ మైలూరు చౌక్‌బార్‌కాలనీ అని బాలుడు చెప్పిన వివరాల మేరకు పోలీసులు తల్లిదండ్రులను పిలిపించి బాలుడిని అప్పగించారు. తమ కుమారుడిని అప్పగించినందుకు వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

పార్కింగ్‌కు అడ్డాగా ప్రధాన రహదారి

- ప్రమాదాలకు గురవుతున్న ప్రజలు
- సమస్యలు పరిష్కరించాలని స్థానికుల విన్నపం



ప్రభుత్వ కార్యాలయం ఎదుట ఇష్టానుసారంగా పార్కింగ్ చేసిన వాహనాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని వివిధ కాలనీలకు వెళ్లే ప్రధాన రహదారి ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ అడ్డగా మారడంతో వాహనదారులు, అధికారులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. రామచంద్రాపురం పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు రోడ్డు పక్కన విద్యార్థులు నడిచి వెళ్లేందుకు లక్షలాది రూపాయలతో ఫుట్‌పాత్ నిర్మించారు. కాలనీవాసులు ఫుట్‌పాత్, రహదారిపై ద్విచక్ర వాహనదారులు వారి వాహనాలను అక్కడ పార్కింగ్ చేసి డ్యూటీలకు వెళ్తున్నారు. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే అధికారులు, కళాశాల విద్యార్థులు, ఆ రోడ్డుపై ప్రయాణం సాగించే వాహనదారులు నరకయాతనపడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయం ముందు నో పార్కింగ్ అని బోర్డు పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుండటంతో తరచూ నిత్యం చిన్నపాటి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై వాహనాలు గెలవకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దామోదరకు అభినందనల వెల్లువ



దామోదరకు పుష్పగుచ్ఛాలను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మునిపల్లి: దామోదరను కలిసిన నాయకులు

జోగిపేట(అందోల్): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా దామోదర రాజనర్సింహ నియమితులు కావడంతో ఆయనను గురువారం అందోల్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఎల్బీ స్టేడియానికి తరలివెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. పదేళ్ల తర్వాత అందోల్‌లో కాంగ్రెస్ తరపున మంత్రి పదవి దక్కడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, పట్లోళ్ల రేఖాప్రవీణ్, రంగ సురేష్, శంకర్, నాగరాజు, చందర్, దుర్గేష్, కోఆప్షన్ సభ్యులు అల్లే శ్రీకాంత్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పద్మనాభరెడ్డి, అందోల్ టేక్మల్ వట్పల్లి మండలాల అధ్యక్షులు శివరాజ్, నిమ్మ రమేష్, రమేష్ జోషి, మాజీ సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి శ్రీనివాస్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, అనిల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు

మునిపల్లి(అందోల్): మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన దామోదర రాజనర్సింహను మునిపల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నాయకులు కంకోల్ నాగేశ్, సురేష్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న నాయకులు, కార్యకర్తలు

జిన్నారం(పటాన్‌చెరు): ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ నేత ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయనున్న సందర్భంగా మండల కేంద్రంలో గురువారం నాయకులు, కార్యకర్తలు టపాసులు కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండల పరిధిలోని నాగధర్‌లో రేణుకాఎల్లమ్మ ఆలయ నాలుగో వార్షికోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు బోనాల ఊరేగింపు చేపట్టారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న జెడ్పీటీసీ మీనాక్షి, నాయకులు

మునిపల్లి(అందోల్): మండలంలోని ఖమ్మంపల్లి ఉపసర్పంచ్ దుర్గయ్య కుమారుడి వివాహాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివాహానికి హాజరైన జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయికుమార్, మొగులయ్య, ఏఎంసీ డైరెక్టర్ మొగులయ్య, నాయకులు మౌలానా, సురేష్, సుభాష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జోగిపేటలో గోశాల ప్రారంభం



పూజలు చేస్తున్న భక్తులు

జోగిపేట(అందోల్): పట్టణంలోని శ్రీకృష్ణ శ్రీకృష్ణ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామ ఫంక్షన్‌హాల్ సమీపంలో ఏర్పాటు చేసిన గోశాలను గోశాల వ్యవస్థాపకులు ఆకుల సుభాష్ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం గోశాలలో హోమాలు, పూజలు, గోపాలకృష్ణ ప్రతిష్ఠ మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పాఠశాల విద్యార్థినులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులు పురం లక్ష్మణ్, బేలూరి రవి, సింగారపు రాము, విజయ్, కౌన్సిలర్ రేఖా ప్రవీణ్, ఆకుల రాజు, రామాగౌడ్, వెంకటేశం, నాగభూషణం, కారుణేశ్వర్, ఆంజనేయులు, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తా



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతెలో అభయాంజనేయ స్వామి ఆలయ 10వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక ప్రజల దీవెనతో ఎమ్మెల్యేగా గెలుపొందానని తెలిపారు.

ఎల్బీ స్టేడియానికి తరలిన నేతలు



హైదరాబాద్‌కు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు గురువారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిలకమర్రి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందన్నారు. రేవంత్‌రెడ్డితోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



మాణిక్యాలరావు

పటాన్‌చెరు టౌన్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ ఆముదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ పద్మారావునగర్ కాలనీకి చెందిన మాణిక్యాలరావు(39) బుధవారం నైట్ డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం భార్య ఫోన్ చేసి కిరాణా సామగ్రి తీసుకురావాలని చెప్పగా వస్తున్నానని తెలిపి ఎంతకూ రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఆఫ్ వచ్చింది. దీంతో భర్త కోసం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి అదృశ్యంపై కుమారుడు ఫిర్యాదు



ముత్తంగి కృష్ణ

పటాన్‌చెరు టౌన్: తండ్రి అదృశ్యంపై కుమారుడు ఫిర్యాదు చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలంలోని భానూర్ బీడీఎల్‌కు చెందిన ముత్తంగి కృష్ణ(49) బుధవారం ఉదయం చిట్కుల్ గ్రామంలో ఉండే సోదరి సావిత్రి వద్దకు వెళ్లాడు. అయితే రాత్రి అయిన కృష్ణ ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు కృష్ణ కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి అదృశ్యంపై కుమారుడు భార్గవ్ సాయి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం



నారాయణరావు

పటాన్‌చెరు టౌన్: యువకుడు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం పరిధిలోని ఒప్పంగి గ్రామానికి చెందిన నారాయణరావు(22) అనే యువకుడు బతుకుతెరువు కోసం పటాన్‌చెరు మండలంలోని ముత్తంగి తేజా కాలనీకి వచ్చి పాశమైలారంలోని ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే నెల రోజులుగా నారాయణరావు ఫోన్ స్విచ్ఆఫ్ రావడంతో కుటుంబసభ్యులు పరిశ్రమకు వెళ్లి వివరాలు తెలుసుకోగా నెల రోజుల నుంచి విధులకు రావడంలేదని చెప్పారు. దీంతో నారాయణరావు కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగరం శ్రీనివాస్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సిబ్బంది హాజరుశాతం పరిశీలించి పాఠశాల నిర్వహణ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి లలిత, సిబ్బంది పాల్గొన్నారు.

వాన.. రైతన్న హైరానా!



మర్పడ్గ శివారులో ధాన్యం కుప్పలపై నిలిచిన వర్షం నీరు



సిర్సనగండ్లలో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన దృశ్యం

- పంట చేతికందే సమయంలో నష్టం

కొండపాక(గజ్వేల్): మిచాంగ్ తుఫాన్ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే సమయంలో నష్టాన్ని తెచ్చిపెడుతోంది. కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో సుమారు 25 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. పక్కనే మల్లన్నసాగర్ ప్రాజెక్టు, చెరువుల్లో నీటి నిల్వలు ఎక్కువగా ఉండడంతో రైతులు వరి వైపు మొగ్గు చూపారు. గతేడాది కంటే కాస్త ఆలస్యంగా పంట చేతికందుతుండడంతో కూలీలు, హార్వెస్టర్ల కొరతతో పనులు మెల్లగా సాగుతున్నాయి. కోసిన పంటను రైతులు రోడ్లపైనే కుప్పలు పోసుకున్నారు. కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో వారం రోజులుగా రోడ్లపైనే ధాన్యం కుప్పలు పేరుకుపోయాయి. రెండు, మూడు రోజులుగా తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం తడిసిముద్దయింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతూ తడిసిన ధాన్యాన్ని వేరు చేస్తూ ఆరబెడుతున్నారు. ఇదిలా ఉండగా కోత దశకు చేరుకున్న పంట చేనులోనే ఉండడంతో వర్షానికి నేలవాలి దెబ్బతినే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్దగా కొనుగోళ్లపై దృష్టి పెట్టలేకపోయారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం కొనుగోళ్లను వేగవంతం చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

రైతులు వరికొయ్యలు కాల్చొద్దు



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): వరిపంట కోసిన తర్వాత కొయ్యలను కాల్చొద్దని కేవీకే శిక్షణ విద్యార్థులు రైతులకు సూచించారు. గురువారం మండలంలోని తునికి వద్ద ఉన్న డీ. రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో వ్యవసాయ శిక్షణ విద్యార్థులు మండలంలోని వెల్మకన్న గ్రామంలో రైతులకు యాసంగి పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు వరి కొయ్యలను కాల్చివేయడం వల్ల భూసారం తగ్గుతుందన్నారు. నేలపైన ఉన్న జీవరాశులు, మిత్ర పురుగులు చనిపోతాయని దీంతో రైతులకు నష్టం కలుగుతుందన్నారు. దీంతో పాటు వాయుకాలుష్యం పెరుగుతుందని, భూమిలో కలియ దున్నడంవల్ల భూసారం పెరుగుతుందన్నారు. భూసార పరీక్షల ఆధారంగా రసాయన ఎరువులు వాడాలని, మోతాదుకు మించి ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడొవద్దన్నారు. విత్తన శుద్ధి చేయాలని, రైతులు సేంద్రియ సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శిక్షణ విద్యార్థులు పూజిత, హారిక, రుచిత, సౌమ్య, మేఘన, ప్రణతి గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

కంపోస్ట్ ఎరువు తయారీ



ఎరువు తయారీని పరిశీలిస్తున్న ఎంపీఓ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలోని డంప్‌యార్డులో తడి చెత్తతో తయారు చేసే కంపోస్ట్ ఎరువు బాగుందని ఎంపీఓ రమేశ్ అన్నారు. గురువారం ఆయన గ్రామంలోని డంప్‌యార్డులో తయారు చేసే కంపోస్ట్ ఎరువు విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిట్కుల్‌లో కంపోస్ట్ ఎరువు తయారీ చేయడంతో పాటు, ఆ ఎరువును ప్యాకింగ్ చేసి గ్రామస్తులకు తక్కువ ధరకు అమ్మడం హర్షణీయమన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ.. తయారైన ఎరువును కిలో, రెండు కిలోల ప్యాకింగ్‌లు చేసి కిలో రూ.10కి అమ్ముతున్నామని, మిగతా ఎరువును పల్లె ప్రకృతివనం, నర్సరీలో వినియోగిస్తామన్నారు.